నెరవేరనున్న సొంతింటి కల

- మొదటి విడతలో 820 మంది ఎంపిక
- పైలట్ ప్రాజెక్టుగా తానేదార్‌పల్లి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు


తానేదార్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

తిప్పర్తి : అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటోంది. గ్రామాల్లో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోంది. తిప్పర్తి మండలంలోని 26 గ్రామ పంచాయతీలకుగాను మొదటి విడతలో 820 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ.ఐదు లక్షలు మంజూరు చేయనుంది. దీంతో సొంతింటి కల నెరవేరబోతోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి విడత బిల్లు మంజూరు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా తిప్పర్తి మండలంలోని తానేదార్‌పల్లి గ్రామ పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆ గ్రామంలో మొత్తం 76 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేశారు. తానేదార్‌పల్లి గ్రామంలో 14 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో ఐదుగురికి మొదటి విడత బిల్లు కూడా మంజూరు చేశారు. అదేవిధంగా మండలంలోని దుప్పలపల్లిలో 27, అంతయ్యగూడెం-5 ఆరెగూడెం-10, గడ్డికొండారం-17, గంగన్నపాలెం-15, గోదోరిగూడెం-26, ఇండ్లూరు-60, జంగారెడ్డిగూడెం-25, జొన్నగడ్డలగూడెం-28, కంకణాలపల్లి-19, కాశివారిగూడెం-13, మామిడాల-66, మర్రిగూడెం-14, పజ్జూరు-40, రాజుపేట-38, రామలింగాలగూడెం-20, రాయినిగూడెం-13, సర్వారం-43, సిలార్‌మియాగూడెం-29, సోమోరిగూడెం-6, తిప్పర్తి -130, వెంకటాద్రిపాలెం-22, యాపలగూడెం-14, ఎల్లమ్మగూడెం-23, యద్రగడ్డలగూడెం-41 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ నిబంధనలు

పథకం ప్రారంభంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 ఎస్‌ఎఫ్‌టీతో నిర్మించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం 400 నుంచి 600 ఎస్‌ఎఫ్‌టీ వరకు పరిమితిని పెంచారు. దీంతో మొదటి విడతలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి విడత బిల్లు వచ్చింది



ఇప్పటివరకు సొంత ఇల్లు లేక ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వం మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో ఇంటి నిర్మాణం ప్రారంభించుకున్నాం. ప్రస్తుతం దర్వాజ లేవల్ వరకు ఇంటి నిర్మాణం పూర్తయ్యింది. మొదటి విడతగా బెస్‌మెంట్ బిల్లు రూ.లక్ష కూడా వచ్చాయి. మా సొంతింటి కల నెరవేరబోతోంది.

– జెరిపోతుల రాములమ్మ, తానేదార్‌పల్లి

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేశాం



తిప్పర్తి మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో మొదటి విడతలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. పైలట్ ప్రాజెక్టుగా తానేదార్‌పల్లి గ్రామాన్ని ఎంపిక చేసి 76 ఇళ్లు మంజూరు చేశాం. అందులో 14 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన 25 గ్రామాల్లో 744 మందికి ఇళ్లు మంజూరు చేశాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ

వైభవంగా సొడమ్మ జాతర ప్రారంభం


బోనాలతో సొడమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి: మండల కేంద్రంలో శ్రీలింగమంతుల స్వామి, సొడమ్మ జాతర సోమవారం వైభవంగా ప్రారంభమయింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి గ్రామంలోని యాదవులు సొడమ్మ జాతరను రెండు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గ్రామంలోని యాదవులంతా సోమవారం ఉదయం ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై సొడమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకుని డప్పు, వాయిద్యాలతో ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలలో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు మేకలు, గొర్రెలను బలిచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఓ లింగా.. ఓ లింగా అంటూ యాదవ యువకులు భేరీలు తిప్పుతూ చేసిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ఈ వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, దూదిమెట్ల బాలరాజుయాదవ్‌లు పాల్గొని యాదవులకు శుభాకాంక్షలు తెలిపారు.

వేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు


ఓగోడులో విద్యుత్ స్తంభాలను అమరుస్తున్న సిబ్బంది

నకిరేకల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వీచిన ఈదురు గాలులకు నేలకూలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని అమర్చే పనులు విద్యుత్ అధికారులు చేపట్టారు. మండలంలోని ఓగోడు, వల్లాభాపురం, పాలెం, నోముల, టేకులగూడెం, నడిగూడెం, కడపర్తి, నెల్లిబండ తదితర గ్రామాల్లో భారీ ఈదురు గాలులతో 200 విద్యుత్ స్తంభాలు నేలకూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయం విదితమే. ఆయా గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ వ్యవసాయ బావుల, బోర్లు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు అమర్చలేదు. రైతుల పంటపొలాల్లో వరినూర్పిళ్లు పూర్తి కావడంతో నేలకూలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని అమర్చే పనులు చేపట్టారు. నకిరేకల్ పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో విద్యుత్ లైన్లకు అడ్డువస్తున్న చెట్ల కొమ్మలను తొలిగించే పనులు చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 200 విద్యుత్ స్తంభాలు గాలులతో కూలిపోయి కొన్ని విరిగిపడ్డాయని మండలం ఏఈ సాయిగణేశ్ తెలిపారు. అన్ని గ్రామాల్లో కొత్త స్తంభాలను అమర్చడం పూర్తయిందని తెలిపారు. విద్యుత్ లైన్లు వేయాల్సి ఉందని, మరో వారం రోజుల్లో పూర్తి చేసి విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం


జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చండూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సోమవారం చండూరు మండలంలోని దోనిపాముల గ్రామంలో జరిగిన సీపీఐ 15వ మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలో కార్యకర్తలకు నాయకులు అందుబాటులో ఉండాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, నిరంకుశ ధోరణి అవలంబిస్తోందన్నారు. నెలల తరబడి రైతులు వీరోచిత పోరాటం చేస్తే వారి డిమాండ్లు నెరవేర్చలేన్నారు. బీజేపీ ప్రభుత్వానికి సహకరించని రాష్ట్రాలకు నిధులు ఇవ్వకుండా బీజేపీకి సంబంధించిన రాష్ట్రాలకు వేల కోట్ల నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ముందుగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నలపరాజు సతీషకుమార్, సహాయ కార్యదర్శులుగా పల్లె యాదయ్య, బొడ్డు వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా బరిగల వెంకన్న, వెంకటేశం, బండమీది వెంకన్న, ఊషయ్య, రమేష్ ఎన్నికయ్యారు.

బీజేపీ మహిళా మోర్చా నాయకుల అరెస్టు

నల్లగొండ టూటౌన్: అందాల పోటీల సందర్భంగా వివిధ దేశాల నుంచి వచ్చిన సుందరీమణులు నాగార్జునసాగర్‌కు వస్తున్న సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావిళ్ల కాశమ్మ, ముంత పద్మ, స్వాతిలను పోలీసులు అరెస్ట్ చేసి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా బీజేపీ వన్ టౌన్ అధ్యక్షుడు గడ్డం మహేష్, పలువురు నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మహిళా మోర్చా నాయకురాళ్లను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా మోర్చా నాయకుల అరెస్టును ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పకీరు మోహన్‌రెడ్డి, అక్కనెపల్లి బలరాం, వెన్నమల్ల మహేష్, దాసరి కృష్ణ, పుట్టల బాలకృష్ణ పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి

చండూరు : మండలవ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు నిధులు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కురుపాటి గణేశ్ సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఆర్డీఓ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన వెంట తరి సురేష్, కురుపాటి శ్రీను ఉన్నారు.

'ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర'

మర్రిగూడ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నరసింహ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.80వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జిల్లా బాలకృష్ణ, జక్కలి అంజయ్య, సహాయ కార్యదర్శిగా శిరసాల రామలింగం, ఉపాధ్యక్షుడిగా బుర్ర నరసింహ, కోశాధికారిగా లింగస్వామిలను ఎన్నుకున్నారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ.జానిమియా, సీపీఐ మండల కార్యదర్శి భిక్షంరెడ్డి, బాలకృష్ణ, అంజయ్య, రామలింగయ్య, లింగస్వామి, నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ బాలనర్సింహస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిట్యాల: పట్టణ శివారులోని శ్రీ బాలనర్సింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పురోహితుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, హోమం, అభిషేకం జరిపించారు. గరుడముద్ద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందంగా ముస్తాబు చేసిన ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కల్యాణ మండపంపైకి తీసుకువచ్చి వేదమంత్రోచ్చరణలతో కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రొఫెసర్ ముప్పా నర్సింహారెడ్డి-భారతి పుస్తెమెట్టెలు, తలంబ్రాలను బొబ్బల శివశంకర్‌రెడ్డి-శ్వేత దంపతులు ఆలయంలో అందజేశారు. కళ్యం పవన్‌కుమార్‌రెడ్డి-స్వప్న దంపతులు ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఇమ్మడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు నల్లా మహేందర్‌రెడ్డి, బూడిద లింగస్వామి, బెల్డె నర్మద సత్యనారాయణ, అమనగంటి నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల కుదింపు సరికాదు


సదస్సులో పాల్గొన్న డీటీఎఫ్ నాయకులు

నల్లగొండ: ప్రభుత్వ పాఠశాలల కుదింపు సరికాదని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన శేషు స్మారక సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్టు ప్రకారం ప్రతి మండలంలో 6 ప్రాథమిక పాఠశాలలు, 3 ఉన్నత పాఠశాలలుగా కుదించే ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం శేషు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.వెంకటేశం, పబ్బతి వెంకటేశ్వర్లు, ఎస్.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.భాస్కర్, పి.వెంకులు, కె.వేణు, ఎ. శ్రీనివాస్, విద్యాసాగర్‌రెడ్డి, ఏడుకొండలు, ఎండీ. ఖుర్షీద్‌మియా, జగతి, బాలనర్సయ్య, పొన్నాల సత్తయ్య, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఆర్.లింగయ్య, బి.వెంకటేశ్వర్‌రావు, టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ..రోడ్డుపైనే మురుగు


పోలీస్ పిచ్చయ్య వీధిలో ధ్వంసమైన డ్రెయినేజీ


నకిరేకల్ రోడ్డులో వైన్స్ వెనుక వీధిలో ..

తిప్పర్తి : మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తిప్పర్తి మండల కేంద్రంలోని పోలీస్ పిచ్చయ్య వీధిలో డ్రెయినేజీ పగిలి మురుగు సాఫీగా కిందకు వెళ్లక రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో ఆ వీధిలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన రావడంతోపాటు దోమల బెడద తీవ్రంగా ఉందని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నకిరేకల్ రోడ్డులో వైన్స్ వెనుక వైపు వీధిలో డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు రోడ్డు వెంట చేరి దుర్వాసన వస్తోందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలోని వీధుల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

టీఎస్ ఈఏపీసెట్‌లో ప్రతిభ


రుత్విక్ మణిసాయి

నల్లగొండ: పట్టణానికి చెందిన మురారిశెట్టి రుత్విక్ మణిసాయి టీఎస్ ఈఏపీసెట్ ఫలితాల్లో 57వ ర్యాంకు సాధించాడు. మణిసాయి హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో విద్యనభ్యసించాడు. మణిసాయి తల్లిదండ్రులు శ్రీనివాస్-రాధాకుమారి. వీరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఉత్తమ ర్యాంకు సాధించిన మణిసాయిని కళాశాల యాజమాన్యం, విద్యార్థి తల్లిదండ్రులను అభినందించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న రాములు

నల్లగొండ టౌన్ : ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో నిర్మాణ రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరి రాములు కోరారు. నల్లగొండలో సోమవారం జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రెట్టింపు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాలు పోరాడుతుంటే ఉన్న వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీహెచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డులో రూ.5500 కోట్ల నిధులు ఉన్నాయని, వాటిని కార్మికుల సంక్షేమానికి కాకుండా ఇష్టం వచ్చినట్లుగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కంచి కేశవులు, అద్దంకి నరసింహ, ఎస్ సైదాచారి, అవుట రవీందర్, బి.వెంకటయ్య, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

నాంపల్లి : ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు సుంకర గణేశ్, కేశమల్ల మహేష్, సైదులు, వెంకటయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డికి సన్మానం


ప్రేమ్‌కరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

నల్లగొండ: జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఓఎస్‌డీగా వెళ్లిన విషయం తెలిసిందే. నల్లగొండ పంచాయతీరాజ్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ బి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.బాలరాజురెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పు రాంబాబు, ఎంపీడీఓలు, కార్యదర్శులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెరుమాల్ల వెంకటేశం, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఆర్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి పద్మజ

మునుగోడు : ఎంఆర్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ అన్నారు. మునుగోడు మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల డీలర్లకు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లూజ్ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల వద్దనే రైతులు విత్తనాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎరువుల దుకాణాల డీలర్లు, సిబ్బంది ఉన్నారు.

నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన ఆవుల రఘువీర్ (40) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ పుల్లారావు మృతుడి కుటుంబ సభ్యుల అనుమతితో సోమవారం రఘువీర్ నేత్రాలను సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు ఆవుల రాములు, ఆవుల లక్ష్మయ్య, ఆవుల స్మిత, వైద్యం వెంకటేశ్వర్లు, వైద్యం శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు.


నేత్రాలు సేకరిస్తున్న వైద్యులు

ధాన్యం అధిక తూకం వేస్తే చర్యలు తీసుకుంటాం

మర్రిగూడ : ధాన్యం అధిక తూకం వేస్తే చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ సోమవారం అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి నిర్ణీత మొత్తం కన్నా అధిక పరిమాణంతో ఉన్న సంచులు కొన్ని రైస్ మిల్లులకు వెళ్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

మర్రిగూడ : కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు పొందాలంటే రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సాహస్ సోమవారం తెలిపారు. రైతులందరూ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్‌తోపాటు ఆధార్‌కు లింక్ ఫోన్ నంబర్ గల ఫోన్ తీసుకుని రైతు వేదికల వద్ద ఏఈఓలను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగ్గారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తు సోమవారం నల్లగొండలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం దగ్గర బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ రాజేందర్‌పై జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలు మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన ఎండీ కరీం అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ ఆకారం గ్రామానికి చేరుకుని కరీం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేల నగదు అందజేశారు.

ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

శాలిగౌరారం మండల పరిధిలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన దేవరకొండ పాపమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబానికి హిమబిందు ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి నాగరాజు సోమవారం 50 కిలోల బియ్యం అందజేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు దేవరకొండ సైదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ మండల కమిటీ నియామకం


బుడిగె సైదులు అధ్యక్షుడు

నకిరేకల్ : బీజేపీ నకిరేకల్ మండల కార్యవర్గాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా బుడిగె సైదులు, ఉపాధ్యక్షులుగా రాచకొండ వీరస్వామి, వేముల విజయ్, సామి విక్రమ్, మాద ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా ఉప్పల నాగరాజు, దొడ్డోది శంకర్, శ్రీకాంత్, కార్యదర్శులుగా మంగదుడ్ల రేణుక, వలిశెట్టి నాగరాజు, బాదిని యాదమ్మ, సీత ఆంజనేయులు, కోశాధికారిగా రాచూరి శేఖర్‌లు నియామకయ్యారు.

డ్రాయింగ్ మెటీరియల్ బహూకరణ


డ్రాయింగ్ మెటీరియల్ అందజేస్తున్న దాత

నకిరేకల్ : మండలంలోని చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు నల్లగొండకు చెందిన రిటైర్డు టీచర్ నూనె జయవెంకటనారాయణ సోమవారం డ్రాయింగ్ మెటీరియల్ బహూకరించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇంద్రకంటి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి

మునుగోడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మునుగోడు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోసుకొండ లింగయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, దుబ్బ వెంకన్న, ముత్యాలు, ఏర్పుల నరేష్, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి చేయూత

మర్రిగూడ : మండలంలోని అజ్జిలాపురం గ్రామానికి చెందిన నిరుపేదలు వడ్త్యా నీలా-రవి దంపతుల కూతురు వివాహానికి సోమవారం రూ.7500 ఆర్థిక సహాయాన్ని ఆ గ్రామ యువత అందజేశారు. కార్యక్రమంలో మెగావత్ చందునాయక్, రొక్కం భాస్కర్‌రెడ్డి, పందుల శ్రీనుగౌడ్, వడ్త్యా రాజు, బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం


సిరిచందనను అభినందిస్తున్న నాయకులు

కేతేపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద విద్యార్థిని అక్కెనపల్లి సిరిచందన గురుకుల పాఠశాలలో చదివి ఈఏడాది పదో తరగతి పరీక్షలో 573 మార్కులు సాధించింది. విద్యార్థిని తండ్రి బ్రహ్మచారి అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందగా.. తల్లి అజిత మిషన్ కుడుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. కాగా సిరిచందనను సోమవారం ఎస్‌ఎస్‌యూఐ నాయకులు కేతేపల్లిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ జిల్లా నాయకులు అల్లి అంజన్ యాదవ్, సంతోష్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పాడేటి సింహాద్రి, గణేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కనగల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కనగల్ ఎంఈఓ పద్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు కనగల్ ఎంఆర్సీ భవనంలో పాఠ్యపుస్తకాలు అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుపేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు !

గట్టుప్పల్ : మండలంలోని వెల్మకన్నె గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ట్రాక్టర్ డ్రైవర్ వల్లపు మల్లేష్ (37)ను హత్య చేసిన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. మల్లేష్‌ది అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకుని ఇంటారాగేషన్ నిర్వహించారు. హత్యానా , ఆత్మహత్యానా అనే కోణంలో గ్రామంలో అనుమానాలు వ్యక్తం చేయగా పోలీసులు భార్యను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిసింది. తను, మరో వ్యక్తితో కలిసి హత్య చేసినట్లు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో విలేకరుల సమావేశంలో పోలీసులు వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం